## ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

- కలెక్టర్ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట, నవంబర్ 17: జిల్లాలో ఎన్నికలు శాంతియుత వాతావరణంలో, స్వేచ్ఛగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని నారాయణపేట, మక్తల్ రెండు నియోజకవర్గాలు కలిపి 18 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 25 వరకు ఓటరు స్లిప్పులను పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి ఓటు వేయాలన్నారు. పీవో, ఏపీవో, ఓపీవోగా విధులు నిర్వహించనున్న 3,000 మంది ప్రభుత్వ ఉద్యోగులకు, పోలీసులు, డ్రైవర్లు, ఇతర అత్యవసర సర్వీసుల వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నోడల్, సెక్టోరియల్, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ తదితర బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సీవిజిల్ ద్వారా 100 ఫిర్యాదులు, టోల్ ఫ్రీ నెంబర్ 1950 ద్వారా 183 ఫిర్యాదులు స్వీకరించామన్నారు. సోషల్ మీడియా, ఎంసీఎంసీ ద్వారా వచ్చే అన్ని రకాల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వాహనాలను తనిఖీ చేసి 42 వాహనాలపై కేసులు నమోదు చేశామని, రూ. 95,000 జరిమానా విధించినట్లు తెలిపారు. సమావేశంలో డీపీఆర్వో రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల నివేదిక పంపించాలి

నారాయణపేట టౌన్, నవంబర్ 17: ఎన్నికల కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదుల నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల పరిశీలకులకు పంపించాలని కలెక్టర్ శ్రీహర్ష కంట్రోల్ రూం టీం సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం టీం సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల పరిశీలకులకు రోజు వారి నివేదికలు పంపించాలని, సీజ్ అయిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ అయిన మద్యం వివరాలు పంపించాలన్నారు. ఎక్సైజ్ శాఖ మద్యం సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడ పట్టుబడినా కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- అడిషనల్ ఎస్పీ సురేశ్



కోయిలకొండలో కవాతు నిర్వహిస్తున్న కేంద్రసాయుధ దళాలు

కోయిలకొండ, నవంబర్ 17: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు అందరూ సహకరించాలని అడిషనల్ ఎస్పీ సురేశ్ సూచించారు. శుక్రవారం మండలంలోని వింజమూరు, ఎల్లారెడ్డిపల్లి, శేరివెంకటాపూర్, లింగాల్‌చేడ్, సురారం, బూర్గుపల్లి, తిర్మలంపల్లి, కానాయపల్లి, రాంపూర్, దమాయపల్లి, కేశ్వాపూర్ తదితర గ్రామాల్లో కేంద్ర సాయుధ దళాలు, పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు భయభ్రాంతులకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై విజయభాస్కర్, కేంద్ర సాయుధ దళాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

నారాయణపేట టౌన్, నవంబర్ 17: జిల్లాలోని వివిధ మండలాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ నందకిశోర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 132 కేవీ మరికల్ ఉప విద్యుత్ కేంద్రం మరమ్మతు కారణంగా మరికల్ 132 కేవీ పరిధిలోని మరికల్, అప్పంపల్లి, వెంకటాపూర్, అప్పక్‌పల్లి, కొండాపూర్, ధన్వాడ, కోటకొండ, కొల్లంపల్లి, చిన్నజట్రం, సింగారం, పేరపళ్ళ, గోటూర్, ఎక్లాస్‌పూర్ ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

- సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గడప గడపకూ వివరించాలి
- ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, నవంబర్ 17: రానున్న శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నారాయణపేట మండలం పేరపళ్లకు చెందిన ఎంపీటీసీ సావిత్రిబాయి, బీజేపీ పేట జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, సురేశ్‌నాయక్, కాంగ్రెస్ యువనేత గోవింద్ నాయక్, తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మాజీ సర్పంచ్ నర్సింహులు అతని అనుచరులు, దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన 40 మంది కాంగ్రెస్ నాయకులు, అదేవిధంగా పట్టణంలోని 17వ వార్డుకు చెందిన 30 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, 18వ వార్డుకు చెందిన 40 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాలకు సమన్యాయం దొరుకుతుందన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రదాతకు పట్టంకట్టండి

- ఎమ్మెల్యే ఎస్.ఆర్‌రెడ్డి సతీమణి స్వాతిరెడ్డి



దామరగిద్దలో ప్రచారం చేస్తున్న స్వాతిరెడ్డి

దామరగిద్ద, నవంబర్ 17: నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ఎస్.రాజేం దర్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, మ్యాని ఫెస్టోను గ్రామస్తులకు వివరిస్తూ కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నడి ఆశమ్మ, బీఆర్ఎస్ మండల మహిళా సభ్యురాలు ఉమాకేవిఎన్‌రెడ్డి, విద్యావతిప్రహల్లాద్‌గౌడ్, శ్రీదేవిశెట్టిశ్రీనివాస్, నా యకులు వన్నడి చంద్రకాంత్, గ్యాంగ్ హన్మంతు, కేవీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే 'పట్నం'ను భారీ మెజార్టీతో గెలిపించాలి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సోదరి నర్మద

మద్దూర్ (కొత్తపల్లి), నవంబర్17: కొడంగల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సోదరి నర్మద,అన్న కూతురు అనుష రెడ్డి అన్నారు. శుక్రవారం వారు మద్దూర్ మండల కేంద్రంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషణ్ డెరెక్టర్ ఎండీ. సలీం, సర్పంచ్ అరుణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సి.వెంకటయ్య,పీఏసీసీఎస్‌చైర్మన్ జగదీశ్వర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను వివరిస్తూ కారుగుర్తుకు ఓటేసి పట్నం నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఫీర్‌హహ్మద్,మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రవినాయక్

పాలమూరు,నవంబర్17: ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రవినాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో ఎంఈవోలు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి పాఠశాల పరిధిలోని తల్లితండ్రులు వారి ప్రాంతంలో నివసించే ఓటర్లకు ఓటు హక్కు ప్రాముఖ్యత, నవంబర్ 30 తేదీన నిర్వహించనున్న పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఎలా ఓటు వేయాలో అవగాహన కల్పించేందుకు అవకాశం ఉందని, అందువల్ల తప్పని సరిగా ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు వేసేందుకు వచ్చే వారికి టెంట్లు, కుర్చీలు,తాగునీరు,మహిళ ఓటర్లు,పురుష ఓటర్లకు వేరువేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నదని,అంతేకాక 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు ,దివ్యాంగ ఓటర్లకు హోం ఓటింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందని, దీంతో పాటు ఎవరైన దివ్యాంగ ఓటర్లు సాక్ష్యం యాప్ ద్వారా నమోదు చేసుకుంటే వారికి రవాణా సౌకర్యం సైతం కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఉపాధ్యాయులు తల్లితండ్రుల సమావేశంలో తల్లితండ్రులందరూ వారి చుట్టు ప్రక్కల వారు ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

డీఈవో రవీందర్ మాట్లాడుతూ హాజరైన వారి చేత తప్పని సరిగా పోలింగ్‌లో పాల్గొని ఓటు వేస్తానని జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎంవో బాలు యాదవ్, ఏఎంవో శ్రీనివాస్, గోవర్ధన్‌గౌడ్, శ్రీకాంత్, ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల, ప్రాథమిక పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నారాయణపేట టౌన్, నవంబర్ 17: పట్టణంలోని 5, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 18 వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఎస్.ఆర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ కౌన్సిలర్ బుల్లెట్‌రాజు, సీనియర్ నాయకులు గందెచంద్రకాంత్, శివరాంరెడ్డి, వెంకట్రాములు, కార్తీక్, హన్మంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

**మరికల్‌లో..**

మరికల్, నవంబర్ 17: మండలంలోని ఎలిగండ్ల మాజీ సర్పంచ్ రామ్‌సింగ్ శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమలో బీఆర్ఎస్ నాయకులు హన్మంతు, ప్రకాశ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడలో..**

ధన్వాడ, నవంబర్ 17: మండలంలో చర్లప్ల, కొండాపూర్, కంసాన్‌పల్లి గ్రామంలో జెడ్పీటీసీ విమాలదేవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దామరగిద్దలో..**

దామరగిద్ద, నవంబర్ 17: మండంలోని గడి మున్కన్‌పల్లి, క్యాతన్‌పల్లి, చాకలివారిపల్లి, బాపన్‌పల్లి, మద్దెలబీడ్, ఉడ్మల్‌గిద్ద, కందెన్‌పల్లి గ్రామాలలో బిఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

**కోయిలకొండలో..**

కోయిలకొండ, నవంబర్ 17: మండలం అంకిళ్లలో బీఆర్ఎస్ నాయకుడు రవి ప్రచారం నిర్వహించారు.